అక్షరశక్తి
The Power of Pen
Evening Daily

సంపుటి: 20 | సంచిక: 301 | వరంగల్ | శుక్రవారం, 04 సెప్టెంబర్ 2026 | పేజీలు: 06

SPECIAL PAGE

# ప్రశ్నించే గొంతుకను..



## విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల్లోకి వచ్చా

నిర్బంధాలే నన్ను రాజకీయంగా తీర్చిదిద్దాయి

డీసీసీబీ, ఆయిల్‌ఫెడ్‌లో రైతుల కోసం పనిచేశా

గ్రేటర్ వరంగల్ మేయర్ రేసులో ఉన్నా

వచ్చే అసెంబ్లీ ఎన్నికలే నా లక్ష్యం

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ తాజా మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

విద్యార్థి దశ నుంచే ప్రజల కోసం పనిచేశా. ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నా. అనేక నిర్బంధాలను ఎదుర్కొంటూ ఎదిగినవాడిని. కష్టాలు వచ్చినప్పుడు పారిపోయే వ్యక్తిని కాదు. పదవులు ఉన్నా లేకపోయినా, గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజల మధ్యే ఉంటున్నా. నిరంతరం పార్టీ కోసం పనిచేస్తున్నా. ఒక మాట మాత్రం స్పష్టంగా చెబుతున్నా.. జంగా అంటే ఒక వ్యక్తి మాత్రమే కాదు.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అనేక నియోజకవర్గాల్లో నాకంటూ ప్రత్యేక ఓటు బ్యాంకు ఉంది. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో నాకంటూ ప్రత్యేకంగా పనిచేసే కార్యకర్తల బలం, ఓటు బ్యాంకు ఉంది. ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపులో నా పాత్ర కీలకంగా ఉంటుంది. తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో నా రాజకీయ ప్రస్థానం, ప్రజా ఉద్యమాల్లో నా అనుభవాలు, కాంగ్రెస్ పార్టీతో నా అనుబంధం, రైతుల కోసం చేసిన కార్యక్రమాలు, గ్రేటర్ వరంగల్ రాజకీయాలు, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నా లక్ష్యం తదితర అంశాలపై నా మనసులోని మాటలను పంచుకున్నా.

- అక్షరశక్తి, ప్రధానప్రతినిధి



# కాంగ్రెస్ దగా పాలనపై బీఆర్ఎస్ నిరసన

- పరకాల అంబేద్కర్ సెంటర్లో వంటావార్పు
- రోడ్డుపైనే మహిళలతో భోజనం చేసిన చల్లా
- హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- మహిళలు, వృద్ధులు, విద్యార్థులకు తీరని అన్యాయం
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు.1000 రోజుల కాంగ్రెస్ దగా పాలనకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పరకాల అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన వంటావార్పు కార్యక్రమానికి మహిళలు, వృద్ధులు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. - అక్షరశక్తి, పరకాల


2



# 2027 జనాభా లెక్కల్లో బీసీ కులాలను సమగ్రంగా లెక్కించాలి

**అక్షరశక్తి,హనుమకొండ:** 2027లో కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనాభా లెక్కల్లో బీసీ కులాల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం తెలంగాణ, హనుమకొండ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ప్రతి కులానికి ప్రత్యేక కోడ్‌తో కూడిన డ్రాప్‌డౌన్ జాబితాను ఏర్పాటు చేసి కులగణన చేపట్టాలని కోరుతూ శుక్రవారం హనుమకొండ ఆర్ట్స్ కళాశాల వద్ద కేంద్ర ప్రభుత్వ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించే ప్రదర్శన నిర్వహించారు. ఫోరం రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కె. వీరస్వామి, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సూర్యకిరణ్, ఫోరం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం ప్రతిపాదించిన ఓపెన్ ఎండెడ్ విధానంలో ప్రజలు తెలిపిన కులం పేరునే నమోదు చేస్తే, ఒకే కులం వివిధ ప్రాంతాల్లో వేర్వేరు పేర్లు, పలుకుబడులు, భాషా రూపాల్లో నమోదై విడిపోయే ప్రమాదం ఉందని ఫోరం ఆందోళన వ్యక్తం చేసింది. దీంతో వాస్తవ కుల జనాభా గణాంకాలు తారుమారయ్యే అవకాశం ఉందని పేర్కొంది. జనగణన ప్రశ్నావళిలో 'వెనుకబడిన వర్గాలు' అంశాన్ని స్పష్టంగా చేర్చాలని, తెలంగాణ, బీహార్ కులగణన విధానాలను పరిశీలించాలని కోరింది. ప్రస్తుత ప్రశ్నావళిని రద్దు చేసి రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, నిపుణులు, ప్రజాప్రతినిధులు, ప్రజలతో విస్తృతంగా చర్చించిన అనంతరం కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

# ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

**అక్షరశక్తి,హనుమకొండ:** ఉపాధ్యాయుల సేవలను గౌరవిస్తూ ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపికలను అందజేయనున్నారు. నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ కాలేజ్ ఆడిటోరియంలో సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారిని సత్కరించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరై కవర్ చేసి విజయవంతం చేయాలని ఇండస్ ఫౌండేషన్ చైర్మన్, కాంటెస్టెడ్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఏనుగుల రాకేష్ రెడ్డి కోరారు.

# రామప్ప దేవాలయాన్ని సందర్శించిన నటుడు మురళీధర్ గౌడ్

**అక్షరశక్తి,వెంకటాపూర్:** మండలంలోని పాలంపేట రామప్ప దేవాలయాన్ని సినీ నటుడు మురళీధర్ గౌడ్ సందర్శించారు. ఆలయ అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర, శిల్పకళ విశిష్టతను టూరిజం గైడ్ తాడబోయిన వెంకటేష్ వివరించారు. ఈ సందర్భంగా మురళీధర్ గౌడ్ మాట్లాడుతూ, రామప్ప ఆలయాన్ని సందర్శించాలన్న తన కోరిక నెరవేరిందని, ఆలయ శిల్పకళ అద్భుతంగా ఉందని ప్రశంసించారు. అనంతరం రామప్ప చెరువులో బోటింగ్ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఇమ్మడి భాస్కర్, టూరిస్ట్ పోలీసులు, దేవాదాయ, పురావస్తు, పర్యాటక శాఖల సిబ్బంది పాల్గొన్నారు.







# కాంగ్రెస్ దగా పాలనపై బీఆర్ఎస్ నిరసన

- పరకాల అంబేద్కర్ సెంటర్లో వంటావార్పు
- రోడ్డుపైనే మహిళలతో భోజనం చేసిన చల్లా
- హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- మహిళలు, వృద్ధులు, విద్యార్థులకు తీరని అన్యాయం
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**అక్షరశక్తి, పరకాల:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు.1000 రోజుల కాంగ్రెస్ దగా పాలనకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పరకాల అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన వంటావార్పు కార్యక్రమానికి మహిళలు, వృద్ధులు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.రోడ్డుపైనే పొయ్యిలు వెలిగించి వంటలు చేసి మహిళలతో కలిసి మాజీ ఎమ్మెల్యే భోజనం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కొక్కటిగా ప్రజలకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల కింద ఇస్తామన్న తులం బంగారం ఎక్కడుందని ప్రశ్నించారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు అండగా నిలిచిన ఈ పథకాలను నిర్వీర్యం చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పటికీ ఆ హామీని అమలు చేయలేదన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని గొప్పలు చెప్పుకుంటూ.. మరోవైపు పురుషులపై చార్జీల భారం పెంచి కుటుంబాల్లోనే పంచాయతీలు పెట్టే పరిస్థితి తీసుకొచ్చారని చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, పేదల సంక్షేమాన్ని విస్మరిస్తే ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వానికి గుర్తుచేస్తూ.. ప్రజల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే రోజుల్లో కాంగ్రెస్ కు గుణపాఠం తప్పదు

- బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీ నరసింహారావు

**అక్షరశక్తి, ములుగు :** తెలంగాణలో అవినీతి, అక్రమాలే రాజ్యమేలుతున్నాయని బీ.ఆర్.ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు అన్నారు. బీ.ఆర్.ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ములుగు జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల మోసపూరిత పాలనపై బీఆర్ఎస్ నాయకులు ప్రజలను చైతన్య పరుస్తున్నారు. అందులో భాగంగానే శుక్రవారం ఏటూరునాగారం మండలంలోని మహిళలతోపాటు స్థానిక మహిళలు సైతం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఓడగూడెం నుంచి చేపట్టిన ర్యాలీ మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపం వరకు సుమారు మూడు కిలో మీటర్ల మేర కొనసాగింది. బస్టాండ్ సమీపంలోని ధర్నా చౌక్ వద్ద



మహిళలు తో పాటు బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమం దద్దరిల్లిపోయింది. ఈ సందర్భంగా ప్రధాన రహదారిపై వంటావార్పు చేపట్టి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు లక్ష్మీనరసింహారావు మాట్లాడారు... కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో అభివృద్ధి శూన్యం అని అన్నారు. మహిళల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం ముందుకు పోతుందని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు చేసిందేమిటో నిరూపించాలని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిర్లక్ష్యం చేయడానికి గల కారణాలను చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరును తెలంగాణ రాష్ట్ర ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. అనంతరం వంటావార్పు వద్ద కు చేరుకొని కార్యకర్తలకు, మహిళలకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో ములుగు నియోజకవర్గ ఇన్చార్జ్ బడే నాగజ్యోతి, ముఖ్య నాయకులు పోరిక గోవింద్ నాయక్,తాటి కృష్ణ,భూక్య జంపన్న,గడదాసు సునీల్ కుమార్, కాకులమర్రి శ్రీలత, కాజా పాషా,ఎండి సర్దార్ పాషా, కాకుల మర్రి ప్రదీప్ రావు, తుమ్మ మల్లారెడ్డి,కాక వెంకటేశ్వర్లు,అంతటి విజయ నాగరాజు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- INTUC కి ఎల్లవేళలా అండగా ఉంటా
- మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్

**అక్షరశక్తి,జనగాం :** విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ హామీ ఇచ్చారు. INTUC కి ఎల్లవేళలా అండగా ఉంటానని ఆయన స్పష్టం చేశారు. విద్యుత్ ఉద్యోగుల సంఘ భవనంలోని 327 యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన 327 యూనియన్ కార్యవర్గ సమావేశానికి EX MP అంజన్‌కుమార్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో 327 యూనియన్ అధ్యక్షులు నీలం ఐలేష్, సెక్రటరీ చెట్టిపల్లి నరేందర్ రెడ్డి, AO కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లు వీరాంజనేయులు, మూల మహేందర్, డివిజనల్ అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్ రెడ్డి, యాదగిరి, కోతి విజయ్ కుమార్ , ఘన్‌పూర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.డి. ఫయాజ్, కార్యవర్గ సభ్యులు, ప్రశాంత్ రెడ్డి నరోత్తం రెడ్డి నేతాజీ సుధాకర్ పెద్దిరెడ్డి వై బాలరాజు బి బాలరాజు చిరంజీవి భాస్కర్ , శ్రీధర్ రాజు నవీన్ లక్ష్మయ్య సాంబరాజు వెంకటేష్ కృష్ణంరాజు మధు అశోక్ పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం






- **వంటావార్పుతో నిరసన తెలిపిన బీఆర్ఎస్ శ్రేణులు**
- **కాంగ్రెస్ దగా పాలనకు సెగ పుట్టించిన మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్**

**అక్షరశక్తి, వర్ధన్నపేట** : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన 'పోరుబాట' కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గంలో వంటావార్పు నిర్వహించారు. ఐనవోలు మండల కేంద్రంలోని అంబేద్కర్ జంక్షన్, మడికొండ చౌరస్తా, తిమ్మాపూర్ క్రాస్‌రోడ్, వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా కూరగాయలు కోసి వంట వండి నిరసన తెలిపారు.

**మహిళలను మోసం చేశారు**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలతో ఎక్కువగా నష్టపోయింది మహిళలేనని అరూరి రమేష్ విమర్శించారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ, గౌరవం లేకుండా పోయాయని, వేధింపులు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయని ఆరోపించారు. రూ.4 వేల పెన్షన్ ఇస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందిస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్నారని మండిపడ్డారు.

**కళ్యాణలక్ష్మి.. తులం బంగారం ఎక్కడ?**

ఆడపిల్ల పెళ్లికి తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని అరూరి రమేష్ అన్నారు. కళ్యాణలక్ష్మి సాయం సక్రమంగా అందక పేద కుటుంబాల్లో ఆడపిల్ల పెళ్లి భారంగా మారిందని పేర్కొన్నారు. పుట్టిన పిల్లలకు కేసీఆర్ కిట్ అందడం లేదని, ప్రోత్సాహకాలు, మహిళలకు పౌష్టికాహారం వంటి పథకాలు నిలిచిపోయాయని విమర్శించారు.


**కేసీఆర్ హయాంలోనే సంక్షేమం**

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ కిట్‌తో పాటు ఆడపిల్ల పుడితే రూ.13 వేలు, మగపిల్లవాడు పుడితే రూ.12 వేల ప్రోత్సాహకం అందించామని అరూరి రమేష్ తెలిపారు. మహిళలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఇంటింటికీ నల్లా ద్వారా నీటిని అందించామని చెప్పారు. మహిళలకు స్కూటీలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో పొలాలు ఎండిపోతున్నాయని, యూరియా దొరకడం లేదని, పెన్షన్లు సక్రమంగా రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అరూరి రమేష్ అన్నారు. రైతు కుటుంబాలకు అండగా నిలిచిన రైతుబీమా పథకాన్ని నిలిపివేశారని ఆరోపించారు.

**బీఆర్ఎస్‌దే అధికారం**

ప్రజలు కేసీఆర్ వెంటే ఉంటామని చెబుతున్నారని అరూరి రమేష్ అన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కేసులకు భయపడవద్దని సూచించారు. తమను ఇబ్బందులకు గురిచేసిన వారికి తగిన సమాధానం చెబుతామని, కార్యకర్తలు, నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల ప్రజాపాలన సంబరాలు



**అక్షరశక్తి,మడికొండ:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా 1000 రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గం, 45వ డివిజన్ పరిధిలోని మడికొండ జంక్షన్‌లో శుక్రవారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. 45వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్ర హరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, కర్ర హరీష్‌రెడ్డితో కలిసి కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గత 1000 రోజులుగా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజారంజక పాలన అందిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా సంబరాలు నిర్వహించారు.

# రేవంత్ సర్కారుకు చరమగీతం తప్పదు..

- **సత్యవతి రాథోడ్, మాలోతు కవిత, బానోత్ శంకర్ నాయక్**
- **మానుకోట, కేసముద్రంలో వంటావార్పు**



**అక్షరశక్తి, మహబూబాబాద్** : ప్రజా కంఠకపాలనలో అన్ని వర్గాల ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని, ఈ ప్రజా కంటక రేవంత్ సర్కారుకు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి సర్కారు ఏర్పడి వెయ్యి రోజులు పూర్తయిన ఏ పథకాన్ని సంపూర్ణంగా పూర్తి చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా కేసముద్రం, మానుకోట మున్సిపాలిటీ కేంద్రాల్లో శుక్రవారం వంటావార్పు కార్యక్రమాలను జిల్లా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు పాల్గొని ప్రసంగించారు. అలవికాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కేసీఆర్ పాలనలో అమలు చేసిన అనేక పథకాలను అమలు చేయకుండా మోసం చేస్తున్నారని మాజీ ఎంపీ, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాలోతు కవిత మాట్లాడుతూ..కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనపై మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ వంటావార్పు కార్యక్రమం చేపట్టి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు మహిళలు, వృద్ధులు, వికలాంగులకు ఎన్నో అలవికాని హామీలిచ్చి.. 1000 రోజులైనా ఒక్క హామీని కూడా సరిగ్గా నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరసనగా ఈ కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. మహబూబాబాద్ కూరగాయల మార్కెట్ కూడలిలో వంట వార్పు ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేశారు. అలాగే కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో ఈ నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి, వైస్ చైర్మన్లు మార్నేని వెంకన్న, ఫరీద్, సీనియర్ నాయకులు పరకాల శ్రీనివాస్ రెడ్డి, నాయిని రంజిత్, గద్దె రవి, డాక్టర్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో అసైన్డ్ రైతుల హక్కులు ప్రస్తావించాలి

**ఎమ్మెల్యేకు ఏబీఎస్ నేత కలకోటి మహేందర్ వినతి**

**అక్షరశక్తి, కమలాపూర్** : కమలాపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కమలాపూర్ లో జరిగిన వంటావార్పు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి అసైన్డ్ భూమి సమితి రాష్ట్ర అధ్యక్షులు కలకోటి మహేందర్ న్యాయవాది వినతిపత్రం అందజేశారు. ఈనెల ఏడో తారీఖు నుండి జరిగే వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో అసైన్డ్ రైతులకు పూర్తి హక్కుల ఇవ్వాలనే అంశాన్ని ప్రస్తావించాలని విజ్ఞప్తి చేశారు. 2022లో వరంగల్ ఆర్ట్స్ కాలేజీలో జరిగిన రైతు గర్జన సభలో రాహుల్ గాంధీ సమక్షంలో నాటి పీసీసీ ప్రెసిడెంట్ నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే అసైన్డ్ రైతులకు పూర్తి హక్కులు ఇస్తామని బహిరంగంగా హామీ ఇచ్చి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారని తెలిపారు. ఇట్టి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తూ అసైన్డ్ రైతులకు ఇచ్చిన హామీని గాలికి వదిలేసిందని ఇట్టి విషయంలో అసైన్డ్ రైతుల తరఫున ఈ అంశాన్ని లేవనెత్తి 15 వేల కుటుంబాలకు పైగా ఉన్న అసైన్డ్ రైతులకు న్యాయం చేయాలని 22.4 లక్షల ఎకరాలు అసైన్డ్ భూములను పిఓటి జాబితా నుండి తొలగించాలని కలకోటి మహేందర్ న్యాయవాది హుజురాబాద్



పాడికౌశిక్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పుల్ల శ్రీనివాస్ బిఆర్ఎస్ నాయకులు, అంబేద్కర్ బీఆర్ఎస్ నాయకులు యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్ల వినోద్ కుమార్, న్యాయవాది పుల్ల రాజ్ కుమార్, పుల్ల హేమంత్ కుమార్,మాట్ల మురళి, మాట్లా శ్రీధర్, మాట్ల దినేష్. పుల్ల శ్రీకాంత్, మాట్ల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



**శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా గోపిక వేషధారణలో చిన్నారి కృతిక సందడి చేసింది. చిరునవ్వులు చిందిస్తూ చిన్నారి గోపిక సంప్రదాయ వస్త్రధారణలో కనువిందు చేసింది.**

# కాంగ్రెస్ పాలనపై బగ్గుమన్న బీఆర్ఎస్

- మహిళల పట్ల కేసీఆర్ ఒక విజన్ ఉన్న లీడర్
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**అక్షరశక్తి, పాలకుర్తి:** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 1000 రోజులు అయినా కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదంటూ బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న నిరసనలలో భాగంగా మూడవ రోజు జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలో, వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో, మహబూబాబాద్ జిల్లా తొర్రురు మండల కేంద్రంలో మహిళలతో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు, వారి సతీమణి ఉషా దయాకర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు నడుస్తున్న కూడా రాష్ట్ర ప్రజానీకానికి చేసింది ఏమి లేదని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ఒక బ్లాక్ మేలర్ అతనికి సంచులు నింపుకొవడం తప్ప పాలన మీద అవగాహన లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు అవుతున్న ఆరు గ్యారంటీలు అమలు చేసింది లేదు అని, మహిళల కోసం మహాలక్ష్మి పథకం కింద 2500/రూపాయలు ఇస్తామని చెప్పి కూడా ఇప్పటి వరకు అమలు చేసింది లేదని అన్నారు. కేసీఆర్ కిట్టు, కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ తో పాటు తులం బంగారం ఇస్తామని బూటకపు మాటలు చెప్పి మహిళలను మోసం చేసింది అన్నారు. వికలాంగులకు 4000/ పెన్షన్ ఇచ్చి వారి కాళ్ళ మీద వారె జీవించే విధంగా కృషి చేసిన మహానుభావుడు కేసీఆర్ అని అన్నారు. కాంగ్రెస్ పీడ విరగడ అవడానికి ఇంకో రెండు సంవత్సరాల కాలం ఉంది తరువాత మళ్లీ వచ్చేది కేసీఆర్ సర్కార్ అని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేసింది చేసేది కూడా కేసీఆర్ గారే అని చెప్పారు. కేసీఆర్ పాలనే తెలంగాణ కు శ్రీరామ రక్ష అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా,మండల బిఆర్ఎస్ నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ సేవలు చిరస్మరణీయం



**అక్షరశక్తి, దుగ్గొండి:** సామాజిక చైతన్యం, విద్య, ఐక్యత, ఆత్మగౌరవం, ప్రజాసేవ కోసం కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ చేసిన కృషి చిరస్మరణీయమని తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఎన్నారై సెల్ రాష్ట్ర కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి ముదిరాజ్ అన్నారు. శుక్రవారం కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 133వ జయంతి సందర్భంగా గిర్నిబావి సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1893 సెప్టెంబరులో శ్రీకృష్ణాష్టమి రోజున జన్మించిన కృష్ణస్వామి ముదిరాజ్.. ముదిరాజ్ సమాజాన్ని సంఘటితం చేయడంతో పాటు విద్య, సామాజిక సంస్కరణలకు విశేష కృషి చేశారన్నారు. 1922లో ముదిరాజ్ సంఘాన్ని ఏర్పాటు చేసి సమాజాన్ని ఒకే వేదికపైకి తీసుకురావడం ఆయన చారిత్రక కృషిలో భాగమన్నారు. విద్యాభివృద్ధికి పాఠశాలలు, హాస్టళ్ల ఏర్పాటును ప్రోత్సహించారని తెలిపారు. హైదరాబాద్ ప్రజాజీవితంలో సుమారు 25 ఏళ్లపాటు మున్సిపల్ కౌన్సిలర్‌గా, 1957లో మేయర్‌గా సేవలందించారని గుర్తుచేశారు. జర్నలిస్టుగా, రచయితగా హైదరాబాద్ చరిత్ర, సంస్కృతికి సంబంధించిన అంశాలను రచనల ద్వారా నమోదు చేశారన్నారు. కృష్ణస్వామి ముదిరాజ్‌ను కేవలం ఒక సామాజిక వర్గ నాయకుడిగా కాకుండా సామాజిక చైతన్యవేత్తగా, విద్యా ప్రేరణదాతగా గుర్తించాలని వారు పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధనకు విద్య, ఐక్యత, ఆత్మగౌరవం, సామాజిక బాధ్యతతో ముందుకు సాగడమే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు పల్లె రమేష్, ఉపాధ్యక్షుడు ఓరంగంటి తిరుపతి, కోశాధికారి సారా రాములు, దుగ్గొండి ఉపసర్పంచ్ పొన్నం వంశీ, రేకంపల్లి ఉపసర్పంచ్, మాజీ ఉపసర్పంచ్ తుమ్మలపల్లి మహేందర్, జటబోయిన రాజు, గొర్రె రమేష్, దండు రమేష్, గొర్రె రఘు, గొర్రె శ్రీను, గొర్రె రాంబాబు, తుమ్మలపల్లి రాజు, గొర్రె సమ్మన్న, మహిళా నాయకులు బొమ్మెరబోయిన యాదమ్మ, శానబోయిన సరోజన, చానబోయిన జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితులకు అండగా సీఎంఆర్ఎఫ్

## ఎమ్మెల్యే జీఎస్సార్



**అక్షరశక్తి, భూపాలపల్లి:** భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం, భూపాలపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పంపిణీ చేశారు. గణపురం మండలంలో 29 మంది లబ్ధిదారులకు 7,13,600, భూపాలపల్లి మండలానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు 7,03500ల విలువగల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.పేద, మధ్యతరగతి కుటుంబాలు వైద్య చికిత్సల కోసం ఆర్థికంగా ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందజేస్తోందని అన్నారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ సాయం అవసరమైన వారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి తరానికి ఆదర్శప్రాయుడు కామ్రేడ్ కర్రె రామస్వామి



**అక్షరశక్తి, ఎల్కతుర్తి :** సమాజంలో అసమానతలు దోపిడీ వివక్షత అవినీతి లంచగొండితనం నిర్మూలించబడి దోపిడీ పీడన లేని సమ సమాజం ఏర్పడాలని కొనసాగుతున్న కమ్యూనిస్టు విప్లవోద్యమంలో కామ్రేడ్ కర్రే రామస్వామి చురుకైన క్రియాశీల కార్యకర్తగా నాయకునిగా తన జీవితకాలం కమ్యూనిస్టు ఉద్యమంలో కొనసాగడం నేటి తరానికి ఆదర్శప్రాయమని భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి అన్నారు. శుక్రవారం రోజున ఎల్కతుర్తి మండలం ఇంద్రానగర్ కర్రె రామస్వామి భౌతిక దేహంపై ఎర్ర కండువా కప్పి జోహార్లు అర్పించి మాట్లాడుతూ కర్రే రామస్వామి మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుంటూ కార్మిక వర్గ శ్రేయో రాజ్యం కొరకు క్రియాశీల పోరాటాలలో పాల్గొనడమే కర్రే రామస్వామి కి మనం ఇచ్చే ఘనమైన నివాళులు అని తెలిపారు. పార్టీ నిర్వహించిన ప్రతి పోరాట కార్యక్రమంలో ముందు వరుసలో ఉండి బాధ్యతాయుతంగా నిజాయితీ తన వంతు బాధ్యతను నిర్వర్తించిన గొప్ప నిగర్వి అని కొనియాడినారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంబాల రాజు సిపిఐ హనుమకొండ జిల్లా కార్యవర్గ సభ్యులు ఊట్కూరి రాములు కర్రే లక్ష్మణ్ శనిగరపు రాజ్ కుమార్ సమితి సభ్యులు మర్రి శ్రీనివాస్ నాంపల్లి లక్ష్మయ్య రామస్వామి భార్య కాంతా లక్ష్మి కూతురు గడ్డం లలిత కుమారుడు కర్రె రాజేందర్ కోడలు మనుమలు మనుమరాలు బంధుమిత్రులు ఇంద్రానగర్ వాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# కుడా చైర్మన్ గుండు సుధారాణికి ఘన సత్కారం



**అక్షరశక్తి, మడికొండ(హనుమకొండ):** పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన మాజీ రాజ్యసభ సభ్యురాలు, తాజా మాజీ మేయర్ గుండు సుధారాణి కుడా చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా హనుమకొండ జిల్లా ప్రాంత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సత్కరించారు. సంఘం కార్యదర్శి కామిని మల్లేష్, పోతరాజు ప్రకాష్ ఆధ్వర్యంలో గుండు సుధారాణిని శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలి సమాజానికి గుండు సుధారాణి గర్వకారణంగా నిలిచారని అన్నారు. కుడా చైర్మన్‌గా నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు, సమాజానికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. ఆమె నాయకత్వంలో కుడా మరింత అభివృద్ధి సాధించాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. గుండు సుధారాణికి పద్మశాలి సంఘం ప్రతినిధులు, నాయకులు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# Y99 యాప్‌లో హనీ ట్రాప్..

## రూ.14.75 లక్షలు మోసం

**అక్షరశక్తి,వరంగల్:** Y99 వెబ్‌సైట్ ద్వారా ఓ యువకుడిని హనీ ట్రాప్ చేసి రూ.14.75 లక్షలు మోసం చేసిన నిందితుడిని వరంగల్ సైబర్ క్రైమ్ పోలీసులు తమిళనాడులోని సేలం జిల్లాలో అరెస్ట్ చేశారు. TGCSB డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, వరంగల్ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో ఈ దర్యాప్తు చేపట్టారు. వరంగల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తుమ్మ ఉదయ్ కిరణ్ (32) ఫిర్యాదు మేరకు క్రైం నంబర్ 21/2026గా కేసు నమోదు చేశారు. దర్యాప్తులో నిందితుడు Y99 యాప్‌లో 'లావణ్య' అనే మహిళగా పరిచయం చేసుకుని బాధితుడి నమ్మకాన్ని పొందినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం అత్యవసర అవసరాలు, విద్య-పరిశోధన ఖర్చులు, వైద్య మరియు వ్యక్తిగత అవసరాల పేరుతో భావోద్వేగ ఒత్తిడి తెచ్చి పలుమార్లు డబ్బులు బదిలీ చేయించుకున్నాడు. వివిధ బ్యాంకు ఖాతాలు, యూపీఐ లావాదేవీల ద్వారా మొత్తం రూ.14,75,100 మోసం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. సాంకేతిక, ఆర్థిక ఆధారాలతో నిందితుడిని గుర్తించిన ప్రత్యేక బృందం సేలం జిల్లాలో అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించింది. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కె. అశోక్ కుమార్ ఆధ్వర్యంలో బి. శివకృష్ణ, దినేష్, భరత్, జహూర్ మొహమ్మద్‌లు దర్యాప్తులో పాల్గొన్నారు. ఆన్‌లైన్‌లో పరిచయమయ్యే వ్యక్తులను పూర్తిగా నమ్మి వ్యక్తిగత, బ్యాంకు లేదా ఆర్థిక వివరాలను పంచుకోవద్దని పోలీసులు సూచించారు. సోషల్ మీడియా, డేటింగ్, చాటింగ్ యాప్‌ల ద్వారా పరిచయమైన వారు డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని లేదా cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

GUEST COLUMN

# మోదీ పన్నెండేళ్ల పాలనలో.. ప్రచారం ఎక్కువ, ఫలితం తక్కువ!



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

పన్నెండేళ్ల మోదీ పాలనను అంచనా వేయాలంటే ఎన్నికల సభల్లో వినిపించిన వాగ్దానాలను కాదు, సామాన్యుడి జీవితంలో వచ్చిన మార్పును చూడాలి. ఈ ప్రమాణంతో చూస్తే 'విశ్వ గురువు', 'అమృతకాలం', 'వికసిత భారత్' వంటి నినాదాల వెనుక అనేక రంగాల్లో పరిష్కారం కాని సమస్యలు, మధ్యలోనే ఆగిపోయిన లక్ష్యాలు, అమలులో వైఫల్యాలు అనేకం కనిపిస్తాయి. ఒక్కో కేంద్ర మంత్రి ఒక్కో శాఖకు బాధ్యుడైనా, ఈ లోపాలన్నీ చివరకు మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పాలనా బాధ్యతలు, సామర్థ్యంపైనే ప్రభావాన్ని చూపిస్తాయి.

రోడ్ల విషయంలో నితిన్ గడ్కరీ మంత్రిత్వ శాఖ భారీ నిర్మాణాల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లింది. కానీ భారత కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నిర్వహించిన 'భారతమాల' ఆడిట్ రిపోర్ట్ భారీ వ్యయ పెరుగుదలపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తింది. కొన్ని గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలకు అనుమతించిన వ్యయంతో పోలిస్తే ఆమోదిత నిర్మాణ వ్యయం అనేక రెట్లు పెరిగింది; గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలకు మొదట రూ.31,000 కోట్లుగా ఆమోదించిన సివిల్ నిర్మాణ వ్యయం రూ.1,13,190 కోట్లకు చేరినట్లు ఆడిట్ పేర్కొంది. అంటే రహదారుల సంఖ్యను చూపించడం ఒక విషయం; వాటి నిర్మాణ నాణ్యత, ఖర్చు నియంత్రణ, బాధ్యత మరో విషయం.

రైల్వేల్లో వందేభారత్ వంటి ఆధునిక రైళ్లను ప్రచార విజయాలుగా చూపిస్తున్నా, సాధారణ ప్రయాణికుడికి రద్దీ, ఆలస్యాలు, టికెట్ సమస్యలు, రైల్వే ప్రయాణం లో భద్రత ప్రధాన సమస్యలు. రైల్వే భద్రతలో 'కవచ్'ను దేశవ్యాప్తంగా వేగంగా విస్తరించలేకపోవడం, వరుస ప్రమాదాలు జరిగిన తర్వాత కూడా భద్రతా మౌలిక సదుపాయాల అమలు వేగంపై ప్రశ్నలు కొనసాగడం అశ్విని వైష్ణవ్ శాఖ పనితీరుకు ప్రతికూల ఉదాహరణ. సాంకేతికతను ప్రదర్శనగా చూపించడం సులభం. కానీ దాన్ని ప్రతి సాధారణ ప్రయాణికుడి భద్రతగా మార్చడం అసలు పరీక్ష.

నిర్మలా సీతారామన్ నేతృత్వంలోని ఆర్థిక వ్యవస్థలో పెద్ద విరోధాభాసం ఉంది. ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని ప్రభుత్వం చెబుతున్నా, రూపాయి దీర్ఘకాలిక పతనం, కుటుంబాలపై జీవన వ్యయ ఒత్తిడి, ఉపాధి నాణ్యత, చిన్న వ్యాపారాల సమస్యలు ఆ వృద్ధి ఎంత సమానంగా ప్రజలకు చేరిందన్న ప్రశ్నను లేవనెత్తుతున్నాయి. పెద్ద కంపెనీల మార్కెట్ విలువలు పెరగడం మాత్రమే ప్రజల ఆర్థిక సంక్షేమానికి ప్రమాణం కాదు.

ఉపాధి రంగంలో వైఫల్యం మరింత తీవ్రమైనది. తాజా వార్షిక పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం 2025లో 15-29 ఏళ్ల యువతలో నిరుద్యోగిత దేశవ్యాప్తంగా గణనీయంగానే ఉంది. కొన్ని రాష్ట్రాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఉదాహరణకు తెలంగాణలో 15-29 ఏళ్ల వయసు గల యువత నిరుద్యోగిత 18.1 శాతంగా నమోదైంది. చదువుకున్న యువతకు సరైన ఉద్యోగం దొరకకపోతే 'స్కిల్ ఇండియా', 'మేక్ ఇన్ ఇండియా', 'స్టార్టప్ ఇండియా' వంటి కార్యక్రమాల గొప్పతనం ప్రశ్నార్థకమే.

కార్మికుల విషయంలోనూ ఇదే విరోధాభాసం. కోట్లాది మంది అసంఘటిత రంగ కార్మికులు సామాజిక భద్రతకు దూరంగా ఉండగా, కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చడం మాత్రమే సంస్కరణ కాదు. ఉద్యోగ భద్రత, కనీస వేతనం, సామాజిక భద్రత, సంఘటిత హక్కులు, కాంట్రాక్టు కార్మికుల రక్షణ వంటి అంశాల్లో కార్మిక సంఘాల ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. 'సులభమైన వ్యాపారం' పేరుతో యజమానులకు సౌలభ్యం పెంచి, కార్మికుడి హక్కులకు, ఉద్యోగ,పని పరిసరాల్లో భద్రతను బలహీనపరిచే ప్రమాదం ఏర్పడిందన్న న్యాయమైన విమర్శలు , ప్రశ్నలు తలెత్తాయి.

రైతుల విషయంలో 2022 నాటికి రైతు ఆదాయం రెట్టింపు చేస్తామన్న లక్ష్యం మోదీ ప్రభుత్వానికి పెద్ద రాజకీయ పరీక్షగా మారింది. ప్రభుత్వం 2016లో ఈ లక్ష్యాన్ని ప్రకటించి, ఆదాయం పెంచడానికి ఏడు మార్గాలను గుర్తించింది. కానీ 2018-19లో వ్యవసాయ కుటుంబం సగటు నెలవారీ ఆదాయం అన్ని వనరులు కలిపి రూ.10,218 మాత్రమేగా నమోదైంది. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసినట్లు నిర్ధారించే నిరంతర, పారదర్శక జాతీయ గణాంకాలను ప్రభుత్వం ప్రజల ముందుంచలేకపోవడం ఆ వాగ్దానం అమలుపై తీవ్రమైన సందేహాన్ని మిగిల్చింది. మూడు వ్యవసాయ చట్టాలపై రైతుల దీర్ఘకాలిక ఉద్యమం, చివరకు వాటి ఉపసంహరణ కూడా ప్రభుత్వం-రైతుల మధ్య విధానపరమైన దూరాన్ని బయట పెట్టింది.సంవత్సరం పై చిలుకు రైతు ఉద్యమాలు చేసినా వారికి ప్రధాని క్షమాపణలు చెప్పినా, వారి న్యాయమైన డిమాండ్ ల పరిష్కారం లభించ లేదు. కనీసం గిట్టుబాటు ధర కలగానే మిగింది.

గ్రామీణ ఉపాధి విషయంలో "మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం" పేరు మార్చినా...దాని అసలు లక్ష్యాలు, ఆదర్శాలు నెరవేరలేదు. ఈ పథకం ప్రజలకు చివరి రక్షణగా ఉండగా, నిధులు, పనిదినాలు, వేతన బకాయిలు, ఆధార్ ఆధారిత చెల్లింపులు వంటి అంశాల్లో నిరంతరం ఫిర్యాదులు వచ్చాయి. 2026లో కూడా వివిధ రాష్ట్రాలపై భారత కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆడిట్ రిపోర్ట్ లు ఈ పథకం అమలు, ఆర్థిక నిర్వహణ, ఉపాధి కల్పన, సామాజిక ఆడిట్, ఫిర్యాదు పరిష్కారంలో అనేక లోపాలను చూపిస్తున్నాయి. గ్రామీణ పేదరికాన్ని తగ్గించాల్సిన పథకాన్ని బలమైన హక్కు ఆధారిత ఉపాధి సాధనంగా కాకుండా బడ్జెట్ భారంగా చూడటం విధానపరమైన వైఫల్యమే.

ఆరోగ్య రంగంలో మనిషికి అవసరమైనది ఆసుపత్రి, వైద్యుడు, మందు, చికిత్స; ప్రభుత్వానికి మాత్రం 'ఆయుష్మాన్ భారత్' అనే భారీ పథకం విజయగాథగా మారింది. కాగ్ ఆడిట్ రిపోర్ట్ లో 2023 పనితీరు ఆడిట్‌లో లక్ష్య కుటుంబాల నమోదు, లబ్ధిదారుల డేటా వంటి అంశాల్లో లోపాలు బయటపడ్డాయి. 2022 నవంబర్ నాటికి లక్ష్యంగా ఉన్న 10.74 కోట్ల కుటుంబాల్లో 7.87 కోట్ల కుటుంబాలే నమోదు అయ్యాయని ఆడిట్ పేర్కొంది. బీమా కార్డు ఇవ్వడం ఒకటి; అందుబాటులో ఉన్న నాణ్యమైన ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను నిర్మించడం మరొకటి.

'ప్రతి ఇంటికి నీరు' అనే లక్ష్యంతో ప్రారంభించిన జల్ జీవన్ మిషన్‌లోనూ ప్రకటించిన కనెక్షన్ సంఖ్యకు, నిరంతరంగా సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉండటానికి మధ్య తేడా ఉంది. 2026లో వచ్చిన రాష్ట్ర స్థాయి ఆడిట్‌లలో లక్ష్య సాధన, సంస్థాగత వ్యవస్థ, నిర్వహణ, నీటి నాణ్యత పర్యవేక్షణ వంటి అంశాల్లో లోపాలు నమోదయ్యాయి. పైపును ఇంటి గుమ్మం వరకు తీసుకురావడం విజయంగా ప్రకటించి, నీరు నిజంగా రోజూ వస్తుందా అనే ప్రశ్నను పక్కన పెట్టడం సరిపోదు.

గృహ నిర్మాణంలోనూ సంఖ్యల విజయగాథకు అమలు నాణ్యత తోడుకాలేదు. ఉత్తరప్రదేశ్‌లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ పథకం కింద 34.71 లక్షల ఇళ్లు మంజూరు కాగా 34.18 లక్షలు పూర్తయ్యాయని ఆడిట్ గుర్తించినప్పటికీ, అమలులో పలు లోపాలు ఉన్నాయని స్పష్టం చేసింది. కాగితంపై ఇల్లు పూర్తయినట్లు చూపించడం కంటే, ఆ ఇంటిలో పేద కుటుంబం నిజంగా గౌరవంగా జీవించగలుగుతోందా అన్నదే అసలు ప్రశ్న.

చిన్న, మధ్యతరహా పరిశ్రమల విషయంలో పెద్ద కార్పొరేట్ పెట్టుబడుల ప్రచారం ఉన్నప్పటికీ, నోట్ల రద్దు, జీఎస్టీ అమలు ప్రారంభ దశలో ఎదురైన సమస్యలు, కోవిడ్ అనంతర డిమాండ్ కొరత, రుణ లభ్యత వంటి అంశాలు చిన్న వ్యాపారాలపై తీవ్రమైన ఒత్తిడిని తెచ్చాయి. కోట్లాది ఉద్యోగాలను సృష్టించే చిన్న పరిశ్రమలకు స్థిరమైన విధాన వాతావరణం ఇవ్వకుండా, అప్పుడప్పుడు ప్యాకేజీలను ప్రకటించడం దీర్ఘకాలిక పారిశ్రామిక విధానానికి ప్రత్యామ్నాయం కాదు.

సరిహద్దు భద్రతలో అమిత్ షా, రక్షణ రంగంలో రాజ్‌నాథ్ సింగ్ ఎదుర్కొన్న సవాళ్లను కూడా ప్రచార విజయాలతో కప్పిపుచ్చలేం. చైనా సరిహద్దులో మౌలిక సదుపాయాల పోటీ, సరిహద్దు ఉద్రిక్తతలు, లడఖ్‌లో దీర్ఘకాలిక సైనిక మోహరింపు వంటి పరిణామాలు 'సరిహద్దు అన్నీ సురక్షితం' అనే రాజకీయ నినాదానికి మించి సంక్లిష్టమైన వాస్తవాన్ని చూపించాయి. బంగ్లాదేశ్ సరిహద్దులో కంచె నిర్మాణంలో భూమి, సమన్వయ సమస్యలు కొనసాగడం కూడా కేంద్ర-రాష్ట్ర పరిపాలనా సమన్వయ వైఫల్యానికి ఉదాహరణ.

విదేశాంగంలో జైశంకర్ వ్యక్తిగతంగా చురుకైన దౌత్య శైలిని ప్రదర్శించినప్పటికీ, అంతర్జాతీయ వేదికలపై భారత్‌కు ఉన్న ప్రభావాన్ని ప్రతి సంక్షోభంలో నిర్ణయాత్మక ఫలితంగా మార్చడం సాధ్యపడలేదు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-గాజా సంక్షోభం, పాకిస్తాన్‌తో సంబంధాలు వంటి సందర్భాల్లో భారత్ తన ప్రయోజనాలను కాపాడుకోవడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాల్సి వచ్చింది; ప్రపంచ సంక్షోభాలకు మధ్యవర్తిగా నిలిచిన 'విశ్వగురువు' చిత్రణ మాత్రం వాస్తవ రాజకీయ ప్రభావంతో ఎప్పుడూ సరిపోలలేదు.

ఇలా చూస్తే సమస్య ఒక్క మంత్రిది కాదు. రహదారుల్లో ఖర్చు, రైల్వేల్లో భద్రత, ఆర్థిక వ్యవస్థలో రూపాయి-ఉపాధి, వ్యవసాయంలో ఆదాయం, కార్మిక రంగంలో భద్రత, ఆరోగ్యంలో అందుబాటు, నీటిలో నాణ్యత, గృహాల్లో అమలు, పరిశ్రమల్లో ఉద్యోగ సృష్టి, విదేశాంగంలో వాస్తవ ప్రభావం——ప్రతి రంగంలోనూ 'ప్రకటన' మరియు 'ఫలితం' మధ్య అంతరం కనిపిస్తోంది. (కాగ్) వరుస ఆడిట్‌లు కూడా పథకాల రూపకల్పనకన్నా అమలు, పర్యవేక్షణ, ఖర్చు నియంత్రణ, ఫలితాల కొలతలో సమస్యలు ఉన్నాయని పదేపదే చూపిస్తున్నాయి.

అందుకే మోదీ ప్రభుత్వ పన్నెండేళ్లకు అసలు కొలమానం ఎన్ని రిబ్బన్లు కత్తిరించారు, ఎన్ని ప్రచార చిత్రాలు విడుదల చేశారు, ఎన్ని భారీ నినాదాలు ఇచ్చారు అనేది కాదు. రైతు ఎందుకు ఇంకా ఆందోళన చెందుతున్నాడు? యువకుడు ఎందుకు ఉద్యోగం కోసం పోటీ పరీక్షల వెనుక పరుగెడుతున్నాడు? కార్మికుడికి ఎందుకు భద్రత లేదు? చిన్న వ్యాపారి ఎందుకు అప్పుల్లో కూరుకుపోతున్నాడు? సాధారణ ప్రయాణికుడు ఎందుకు భద్రతపై ఆందోళన చెందుతున్నాడు? ప్రభుత్వ ఆసుపత్రి ఎందుకు బలహీనంగా ఉంది? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పలేని పాలన ఎంత గొప్ప ప్రచారం చేసుకున్నా, అది ప్రజల జీవితాలను మార్చిన సమర్థ పాలనగా చరిత్రలో నిలవదు. ప్రచారానికి పన్నెండేళ్లు కావచ్చు కానీ, ఫలితాలకు మాత్రం ప్రజలు ఇంకా అన్ని విషయాల్లో నిరాశగా ఎదురు చూస్తూనే ఉన్నారు. జన్‌జీ , కాక్రోచ్ జనతాపార్టీ, ఇప్పుడు 6 ఏళ్ళ పసి బాలుడు వీధుల్లో తిరుగుతూ, సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తూ, దేశ సమస్యల పరిష్కారాలపై మోదీ మౌనాన్ని , ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ గుక్క తిప్పుకోకుండా, తడబాటు లేకుండా ఇంటర్వ్యూల మీద ఇంటర్వ్యూలు ఇస్తుండటం ఆశ్చర్యం కలగిస్తోంది.ఇకనైనా మోదీ ప్రభుత్వం కళ్ళు తెరిచి లోపాలను సరిదిద్దుకొంటుందేమో వేచి చూడాలి.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.

28-08-2026_Layout 1 04-09-2026 18:36 Page 3



# ఉపాధ్యాయుడిని కాపాడుదాం..
# మన భవిష్యత్తును కాపాడుకుందాం..

దేశ భవిష్యత్తు విద్యావ్యవస్థపై ఆధారపడి ఉంటుంది. విద్యావ్యవస్థకు వెన్నెముక ఉపాధ్యాయుడు. విద్యార్థికి పాఠ్యాంశాలను బోధించడం మాత్రమే ఉపాధ్యాయుడి బాధ్యత కాదు. వివేకం, జ్ఞానం, క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, మానవత్వం, దేశభక్తి వంటి లక్షణాలను విద్యార్థుల్లో పెంపొందించడం కూడా గురువు ప్రాథమిక కర్తవ్యం. భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉంది. 'పితృదేవోభవ.. ఆచార్యదేవోభవ' అనే భావనలోనే ఉపాధ్యాయుని గొప్పతనం స్పష్టమవుతుంది. అయితే నేటి సమాజాన్ని పరిశీలిస్తే ఒక కీలక ప్రశ్న ఎదురవుతోంది. విద్యార్థి భవిష్యత్తును నిర్మించే ఉపాధ్యాయుడి భవిష్యత్తును ఎవరు నిర్మిస్తున్నారు?

### మారుతున్న సమాజంలో గురువు పాత్ర

ఒకప్పుడు సమాజంలో అత్యంత గౌరవనీయమైన వృత్తిగా భావించిన ఉపాధ్యాయ వృత్తి నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. బాధ్యతలు పెరిగాయి.. పని భారం పెరిగింది.. అంచనాలు పెరిగాయి. కానీ అదే స్థాయిలో ఉపాధ్యాయుడికి గౌరవం, మానసిక ప్రశాంతత, వృత్తిపరమైన స్వేచ్ఛ లభిస్తున్నాయా? అనేది ఆలోచించాల్సిన అంశం. నేటి ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు చెప్పే వ్యక్తి కాదు. విద్యార్థికి మార్గదర్శి, మెంటార్, కౌన్సిలర్, వ్యక్తిత్వ నిర్మాణకర్త, సామాజిక చైతన్యకర్త కూడా. సాంకేతిక పరిజ్ఞానం విపరీతంగా విస్తరించిన ఈ కాలంలో సమాచారం విద్యార్థి చేతిలోకి వచ్చింది. ఇంటర్నెట్, సోషల్ మీడియా, కృత్రిమ మేధస్సు వంటి సాధనాలు అపారమైన సమాచారాన్ని అందిస్తున్నాయి. అయితే సమాచారం పొందడం ఒకటైతే.. దానిని విశ్లేషించి నిజానిజాలను గుర్తించి సరైన నిర్ణయం తీసుకోవడం మరోటి. ఈ విషయంలో ఉపాధ్యాయుడి పాత్ర మరింత కీలకంగా మారింది. ఏం చదవాలో చెప్పడం మాత్రమే కాదు.. ఎలా ఆలోచించాలో నేర్పడం గురువు బాధ్యతగా మారింది.

### విలువల పతనానికి గురువునే బాధ్యుడిని చేయాలా?

సాంకేతిక అభివృద్ధి వేగంగా జరుగుతున్నప్పటికీ మానవీయ విలువలు అదే స్థాయిలో పెరుగుతున్నాయా అన్న ప్రశ్న తలెత్తుతోంది. గౌరవం, సహనం, క్రమశిక్షణ, నిజాయితీ, బాధ్యత, పెద్దలను గౌరవించడం, ఇతరుల అభిప్రాయాలను వినడం వంటి విలువలు బలహీనపడుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. విద్యార్థుల ప్రవర్తనలో మార్పు వచ్చిన ప్రతిసారీ అందుకు ఉపాధ్యాయుడినే బాధ్యుడిని చేయడం ఎంతవరకు సమంజసం? ఒక విద్యార్థి రోజులో కొంత సమయం మాత్రమే విద్యాసంస్థలో గడుపుతాడు. మిగిలిన సమయంలో కుటుంబం, స్నేహితులు, మొబైల్, సోషల్ మీడియా, సినిమాలు, ఇంటర్నెట్, సమాజ వాతావరణం అతని ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల విద్యార్థి వ్యక్తిత్వ నిర్మాణం ఉపాధ్యాయుడి ఒక్కరి బాధ్యత కాదు. కుటుంబం, విద్యావ్యవస్థ, సమాజం, ప్రభుత్వం, మీడియా.. అన్నీ కలిసి పనిచేసినప్పుడే విలువలతో కూడిన పౌరుడు తయారవుతాడు.

### బోధనేతర పనులే ఎక్కువ!

గతంలో ఉపాధ్యాయుడి ప్రధాన బాధ్యత బోధన. కానీ నేడు బోధనతో పాటు పరిపాలనా, సాంకేతిక, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన అనేక బాధ్యతలు కూడా ఉపాధ్యాయులపై పడుతున్నాయి. రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ డేటా ఎంట్రీ, నివేదికలు,






సర్వేలు, పరీక్షల నిర్వహణ, ప్రభుత్వ కార్యక్రమాల అమలు, శిక్షణలు, ఎన్నికల విధులు.. ఇలా అనేక పనులు ఉపాధ్యాయుడి రోజువారీ బాధ్యతల్లో భాగమయ్యాయి. బోధించాలి.. ఫలితాలు సాధించాలి.. రికార్డులు నిర్వహించాలి.. ఆన్‌లైన్ డేటా నమోదు చేయాలి.. ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించాలి.. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి.. తల్లిదండ్రుల అంచనాలను అందుకోవాలి. ఇన్ని బాధ్యతల మధ్య ఉపాధ్యాయుడు తన ప్రధాన కర్తవ్యమైన బోధనకు ఎంత సమయం కేటాయించగలడు? ఇది కేవలం ఉపాధ్యాయుడి సమస్య కాదు.. మొత్తం విద్యావ్యవస్థకు సంబంధించిన సమస్య.

### ఖాళీ పోస్టు.. తరగతి గదిలో పెద్ద లోటు

ఉపాధ్యాయుల కొరతను కేవలం ఉద్యోగ ఖాళీల సమస్యగా చూడకూడదు. ఒక ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉంటే అది కార్యాలయ రికార్డుల్లో ఒక ఖాళీగా కనిపించవచ్చు. కానీ అదే ఖాళీ తరగతి గదిలోకి వచ్చినప్పుడు అది విద్యార్థికి తగ్గిన బోధనా సమయం.. పనిచేస్తున్న ఉపాధ్యాయుడిపై పెరిగిన పని భారం.. చివరికి విద్యా నాణ్యతకు సవాలుగా మారుతుంది. అనేక ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా ఉన్న సిబ్బందిపైనే అదనపు బోధనా భారం పడుతోంది. అందువల్ల ఖాళీ పోస్టులను భర్తీ చేయడం కేవలం ఉద్యోగాల కల్పన కాదు. అది విద్యార్థి విద్యా హక్కును పరిరక్షించడం.

### కనిపించని సంక్షోభం.. ఉపాధ్యాయుడి మానసిక ఒత్తిడి

ఉపాధ్యాయుడి చేతిలో పుస్తకం కనిపిస్తుంది.. కానీ అతని మనసులోని ఒత్తిడి కనిపించదు. తరగతి గదిలో చిరునవ్వుతో పాఠం చెప్పే ఉపాధ్యాయుడు.. తరగతి బయట ఎన్నో ఆలోచనలతో సతమతమవుతుండవచ్చు. విద్యార్థుల ఫలితాలు ఎలా వస్తాయి? అధికారుల అంచనాలను అందుకోగలనా? ఇంకా ఎన్ని నివేదికలు పూర్తి చేయాలి? విద్యార్థుల ప్రవర్తనలో ఎలా మార్పు తీసుకురావాలి? తల్లిదండ్రుల అంచనాలను ఎలా అందుకోవాలి? ఇలా అనేక ప్రశ్నలు ఉపాధ్యాయుడి మానసిక ప్రశాంతతను ప్రభావితం చేస్తాయి. ఉపాధ్యాయుడు కూడా ఒక మనిషే. అతనికీ కుటుంబ బాధ్యతలు, భావోద్వేగాలు, వ్యక్తిగత సమస్యలు ఉంటాయి. అతనికి ప్రశంస అవసరం.. గౌరవం అవసరం. మానసికంగా అలసిపోయిన ఉపాధ్యాయుడి నుంచి నిరంతరం సృజనాత్మకమైన, ఉత్తమమైన బోధనను ఆశించడం వాస్తవికం కాదు. అందుకే ఉపాధ్యాయుల మానసిక ఆరోగ్యం కూడా విద్యా విధానంలో ఒక ముఖ్యమైన అంశంగా మారాలి.

### తల్లిదండ్రులు భాగస్వాములుగా మారాలి

విద్యార్థి విజయానికి తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకం. పిల్లల ప్రతి తప్పును సమర్థించడం, ఉపాధ్యాయుడి సూచనలను వెంటనే ప్రశ్నించడం, మార్కులనే విజయానికి ఏకైక ప్రమాణంగా చూడటం విద్యార్థి వ్యక్తిత్వ నిర్మాణంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. తల్లిదండ్రులు ఉపాధ్యాయుడిని తమ పిల్లలకు ప్రత్యర్థిగా కాకుండా.. వారి భవిష్యత్తు నిర్మాణం కోసం పనిచేసే భాగస్వామిగా చూడాలి. తల్లిదండ్రులు పిల్లలకు జీవితాన్ని ఇస్తారు.. ఉపాధ్యాయులు ఆ జీవితానికి దిశను చూపిస్తారు. ఈ రెండు శక్తులు కలిసి పనిచేసినప్పుడే విద్యార్థి సంపూర్ణంగా ఎదుగుతాడు. విద్యార్థులకు ప్రశ్నించే హక్కు ఉంది. కానీ ఉపాధ్యాయుడిని అవమానించే హక్కు లేదు. వారికి స్వేచ్ఛ ఉంది. కానీ క్రమశిక్షణను విస్మరించే స్వేచ్ఛ కాదు. హక్కులతోపాటు బాధ్యతలు కూడా ఉంటాయి. విద్యార్థి--ఉపాధ్యాయ సంబంధం భయంపై కాకుండా పరస్పర గౌరవంపై నిర్మించాలి.

### విధానాలు గొప్పగా ఉంటే సరిపోదు

జాతీయ విద్యా విధానం--2020 భారత విద్యావ్యవస్థలో అనేక కీలక మార్పులకు దిశానిర్దేశం చేసింది. బాల్య విద్య నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర అభివృద్ధి, నైపుణ్యాలు, విలువలు, విమర్శనాత్మక ఆలోచన, బహుళశాఖ విద్యకు ప్రాధాన్యం ఇచ్చింది. ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి, నిరంతర శిక్షణ, మెరుగైన పని పరిస్థితులకు కూడా ప్రాధాన్యం కల్పించింది. అయితే ఏ విద్యా విధానం విజయవంతం కావాలన్నా దాని అమలు తరగతి గదిలోనే జరగాలి. అందుకే విధానాలను రూపొందించేవారు క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులను, తరగతి గదుల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిగణనలోకి తీసుకోవాలి.

### ప్రభుత్వ బాధ్యత ఏమిటి?

ఉపాధ్యాయుల నుంచి నాణ్యమైన విద్యను ఆశించే ప్రభుత్వం అందుకు అనువైన పని వాతావరణాన్ని కల్పించాలి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వేగంగా భర్తీ చేయాలి. అనవసరమైన బోధనేతర పనిభారాన్ని తగ్గించాలి. అవసరమైన చోట బోధనేతర సిబ్బందిని నియమించాలి. ఉపాధ్యాయులకు వృత్తిపరమైన స్వేచ్ఛ కల్పించాలి. అదేవిధంగా ఉపాధ్యాయుల సమస్యలను వినేందుకు సమర్థవంతమైన వ్యవస్థ ఉండాలి. మానసిక ఒత్తిడిని తగ్గించే కార్యక్రమాలు, కౌన్సిలింగ్, నిరంతర వృత్తిపరమైన శిక్షణకు తగిన అవకాశాలు కల్పించాలి. డిజిటల్ సాంకేతికత ఉపాధ్యాయుడికి సహాయకారిగా ఉండాలి కానీ అదనపు భారంగా మారకూడదు. ఉపాధ్యాయుడి పనితీరును కేవలం పరీక్ష ఫలితాల ఆధారంగానే అంచనా వేయడం సరికాదు. ఉత్తమ సేవలను గుర్తించి ప్రోత్సహించాలి. ఉపాధ్యాయుడిని ఫలితాల యంత్రంగా చూడకూడదు.

### మార్కులకు మించిన విజయం

ఒక విద్యార్థిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం.. ఒక విద్యార్థిని చెడు మార్గం నుంచి బయటకు తీసుకురావడం.. నిరాశలో ఉన్న విద్యార్థికి జీవితంపై ఆశ కల్పించడం.. ఇవన్నీ ఉపాధ్యాయుడి విజయాలే. కానీ ఇలాంటి విజయాలను ఏ మార్కుల పట్టికలో కొలవగలం? విద్య అంటే కేవలం మార్కులు కాదు. విద్య అంటే జ్ఞానం.. బాధ్యత.. మానవత్వం. ఒక విద్యార్థి మంచి మార్కులు సాధిస్తే అది విజయం కావచ్చు. కానీ అతను మంచి మనిషిగా ఎదిగితే అది అంతకంటే గొప్ప విజయం. ఆ మార్పు వెనుక ఉన్న ఉపాధ్యాయుడి పాత్రను సమాజం గుర్తించాలి.

### గురువును గౌరవించడం.. భవిష్యత్తును గౌరవించడం

ఉపాధ్యాయుడిని గౌరవించడం అంటే ఒక వ్యక్తిని మాత్రమే గౌరవించడం కాదు. అది విద్యను గౌరవించడం.. జ్ఞానాన్ని గౌరవించడం.. మన భవిష్యత్తును గౌరవించడం. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా విద్యార్థుల్లో మానవీయ విలువలను పెంపొందించే మానవ సంబంధాన్ని పూర్తిగా భర్తీ చేయడం సాధ్యం కాదు. అందుకే ఉపాధ్యాయుడి గౌరవాన్ని కాపాడటం సమాజం మొత్తం బాధ్యత.


### గురువు బలంగా ఉంటేనే..

నేటి సమాజంలో ఉపాధ్యాయుడు కీలకమైన మలుపు వద్ద నిలబడి ఉన్నాడు. ఒకవైపు బాధ్యతలు పెరుగుతున్నాయి.. మరోవైపు విమర్శలు పెరుగుతున్నాయి. ఒకవైపు సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తోంది.. మరోవైపు మానవీయ విలువలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉపాధ్యాయుడిని ఒంటరిగా నిలబెట్టకూడదు. అతని వెనుక ప్రభుత్వం, తల్లిదండ్రులు, విద్యార్థులు, సమాజం నిలబడాలి. ఉపాధ్యాయుడికి బాధ్యతలు మాత్రమే కాదు.. గౌరవం కావాలి. ఆదేశాలు మాత్రమే కాదు.. ఆత్మవిశ్వాసం కావాలి. పని భారం మాత్రమే కాదు.. పనిచేసేందుకు అనుకూలమైన వాతావరణం కావాలి. జవాబుదారీతనం మాత్రమే కాదు.. వృత్తిపరమైన స్వేచ్ఛ కూడా కావాలి. ఉపాధ్యాయుడి బలహీన పరిస్థితి విద్యను బలహీనపరుస్తుంది. విద్య బలహీనపడితే సమాజం బలహీనపడుతుంది. సమాజం బలహీనపడితే దేశ భవిష్యత్తే ప్రశ్నార్థకమవుతుంది. అందుకే ఉపాధ్యాయుడిని కాపాడుకుందాం. ఉపాధ్యాయుడి గౌరవాన్ని కాపాడుదాం. ఉపాధ్యాయుడి మానసిక ప్రశాంతతను కాపాడుకుందాం. ఎందుకంటే ఉపాధ్యాయుడిని కాపాడటం అంటే.. మన భవిష్యత్తును కాపాడటమే.



- డాక్టర్ డి. మాధవి
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ పొలిటికల్ సైన్స్
తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్, వరంగల్ తూర్పు

విద్యార్థి దశ నుంచే ప్రజల కోసం పనిచేశా. ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నా. అనేక నిర్బంధాలను ఎదుర్కొంటూ ఎదిగినవాడిని. కష్టాలు వచ్చినప్పుడు పారిపోయే వ్యక్తిని కాదు. పదవులు ఉన్నా లేకపోయినా, గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజల మధ్యే ఉంటున్నా. నిరంతరం పార్టీ కోసం పనిచేస్తున్నా. ఒక మాట మాత్రం స్పష్టంగా చెబుతున్నా.. జంగా అంటే ఒక వ్యక్తి మాత్రమే కాదు.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అనేక నియోజకవర్గాల్లో నాకంటూ ప్రత్యేక ఓటు బ్యాంకు ఉంది. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో నాకంటూ ప్రత్యేకంగా పనిచేసే కార్యకర్తల బలం, ఓటు బ్యాంకు ఉంది. ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపులో నా పాత్ర కీలకంగా ఉంటుంది. తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో నా రాజకీయ ప్రస్థానం, ప్రజా ఉద్యమాల్లో నా అనుభవాలు, కాంగ్రెస్ పార్టీతో నా అనుబంధం, రైతుల కోసం చేసిన కార్యక్రమాలు, గ్రేటర్ వరంగల్ రాజకీయాలు, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నా లక్ష్యం తదితర అంశాలపై నా మనసులోని మాటలను పంచుకున్నా. - అక్షరశక్తి, ప్రధానప్రతినిధి



# ప్రశ్నించే గొంతుకను..

## విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల్లోకి వచ్చా

నిర్బంధాలే నన్ను రాజకీయంగా తీర్చిదిద్దాయి

డీసీసీబీ, ఆయిల్‌ఫెడ్‌లో రైతుల కోసం పనిచేశా

గ్రేటర్ వరంగల్ మేయర్ రేసులో ఉన్నా

వచ్చే అసెంబ్లీ ఎన్నికలే నా లక్ష్యం

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ తాజా మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

### నిర్బంధాల నుంచే నా రాజకీయ ప్రస్థానం

మొదటి నుంచీ మాది కాంగ్రెస్ పార్టీ కుటుంబమే. మా నాన్న సర్పంచ్‌గా పనిచేశారు. అయితే నేను మాత్రం పాఠశాల దశ నుంచే విద్యార్థి రాజకీయాల్లోకి వచ్చా. ప్రజల కోసం పనిచేయడం ప్రారంభించా. ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న క్రమంలో అప్పటి ప్రభుత్వాల నుంచి అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నా. పోలీసుల నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. ఆ నిర్బంధాలు, ప్రజా ఉద్యమాలే నన్ను నాయకుడిగా తీర్చిదిద్దాయి. విద్యార్థి దశలో నా రాజకీయ గురువు సుధాకర్‌గాంధీ. ఆయన వల్లే నేను ప్రజా ఉద్యమాల్లోకి వచ్చా. ప్రజల సమస్యలపై ప్రశ్నించడం నేర్చుకున్నా. ప్రశ్నించకుండా ఉంటే సమస్యలు పరిష్కారం కావు. ప్రజల కోసం ప్రశ్నించినప్పుడే ప్రజలు మన వెంట నడుస్తారు. అదే నమ్మకంతో ఇన్నేళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్నా. నిర్బంధాలు, కేసులు, కష్టాలు వచ్చినప్పుడల్లా వెనక్కి వెళ్లకుండా మరింత బలంగా పనిచేశా. ప్రజల మధ్య ఉండటం, ప్రజల సమస్యలపై పోరాడటం నా రాజకీయ జీవితానికి మొదటి నుంచీ పునాది.

### వచ్చే అసెంబ్లీ ఎన్నికలే నా టార్గెట్

దేశవ్యాప్తంగా జరుగుతున్న అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా తెలంగాణలో కూడా నియోజకవర్గాల రూపురేఖలు మారే అవకాశం ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాల స్వరూపం కూడా మారవచ్చు. డీలిమిటేషన్ అంశాన్ని నేను ఆసక్తిగా గమనిస్తున్నా. నియోజకవర్గాల పునర్విభజన ఎలా జరుగుతుందనే దానిపైనే నేను ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది ఆధారపడి ఉంటుంది. అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం కచ్చితంగా బరిలో ఉంటా. ఎక్కడి నుంచి అనేది డీలిమిటేషన్ తర్వాత నిర్ణయించుకుంటా. కాంగ్రెస్ పార్టీ పెద్దలు కూడా నా పట్ల సానుకూలంగా ఉన్నారన్న నమ్మకం ఉంది. అనేక ఎన్నికల్లో పార్టీ పెద్దలు, అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి పనిచేశా. ఎక్కడా ధిక్కరించలేదు. ఈ క్రమంలో సీనియర్ నాయకుడిగా రాజకీయంగా, ఆర్థికంగా చాలా నష్టపోయా. అయినా పార్టీని వీడలేదు. పార్టీ కోసం పనిచేస్తూనే ఉన్నా. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాకు మంచి అవకాశం ఇస్తుందన్న నమ్మకం ఉంది.

### గ్రేటర్ మేయర్ రేసులో ఉన్నా

అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటూ పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకుడిగా కాంగ్రెస్ పార్టీ నన్ను గుర్తిస్తుందన్న నమ్మకం నాకు ఉంది. పార్టీపై నాకు చాలా విశ్వాసం ఉంది. గ్రేటర్ వరంగల్ ప్రజలు కూడా నన్ను ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారన్న నమ్మకం ఉంది. రానున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ రేసులో ఉన్నా. నా కూతురు డాక్టర్ నిఖితారెడ్డి కూడా బరిలో ఉంటుంది. గ్రేటర్ వరంగల్ ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక దశాబ్దాలుగా పనిచేస్తున్నా. వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నా. మహిళలు, కార్మికులు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు.. ఇలా అన్ని వర్గాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నా. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నా. ఇప్పటికే క్షేత్రస్థాయిలో సీరియస్‌గా పనిచేస్తున్నా. ప్రజల్లో ఉండటం నాకు కొత్త కాదు. పదవి ఉన్నప్పుడే ప్రజల దగ్గరకు వెళ్లే రాజకీయ నాయకుడిని కాదు. పదవి ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యే ఉంటా.



### ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిందే

రాజకీయాలతో పాటు పాత్రికేయ రంగం కూడా కొంత కలుషితమైందన్న బాధ నాకు ఉంది. ఒకప్పుడు రాజకీయాల్లో నైతిక విలువలకు ప్రాధాన్యం ఉండేది. ఇప్పుడు పవర్ పాలిటిక్స్, మనీ పాలిటిక్స్ పెరిగిపోయాయి. దీంతో ప్రజా ప్రయోజనాలు వెనక్కి వెళ్లి వ్యక్తిగత ప్రయోజనాలే ముందుకు వస్తున్నాయి. ప్రజల కోసం పనిచేయాల్సిన రాజకీయ వ్యవస్థలో వ్యక్తిగత ప్రయోజనాలు పెరగడం మంచిది కాదు. ఇదే సమయంలో పాత్రికేయ రంగంలోనూ కొన్ని మార్పులు వస్తున్నాయి. ఏదేమైనా పత్రికలు ప్రతిపక్ష పాత్ర పోషించాలి. జర్నలిస్టులు ప్రజల పక్షాన ఉండాలి. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావాలి. ప్రజల కోసమే రాయాలి. ప్రభుత్వాలు తప్పు చేస్తే ప్రశ్నించాలి. ప్రజలకు సంబంధించిన అంశాలను నిర్భయంగా రాయాలి. అలా అయితేనే ప్రభుత్వాలు, ఇతర వ్యవస్థలు కూడా ప్రజల ప్రయోజనాల కోసం పనిచేసే పరిస్థితి ఉంటుంది. ప్రజా ప్రయోజనాల పరిరక్షణ బాధ్యతలో జర్నలిస్టుల పాత్ర చాలా కీలకం.

### రెండుసార్లు ఏకగ్రీవంగా గెలిచా

కాంట్రాక్టర్‌గా, వ్యాపారవేత్తగా పనిచేస్తూనే రాజకీయాల్లోకి వచ్చా. సీరియస్ పొలిటిషియన్‌గా మారిన తర్వాత కాజీపేట దర్గా పీఏసీఎస్ చైర్మన్‌గా రెండుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యా. ఆ తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా పనిచేశా. ఆ సమయంలో జిల్లా రైతులకు మేలు చేసేలా అనేక కార్యక్రమాలు చేపట్టా. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడంతోపాటు వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేశా. డీసీసీబీని మరింత బలోపేతం చేయడానికి కూడా పనిచేశా. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్ర సీడ్స్ అండ్ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టా. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును పెంచేందుకు అహర్నిశలు పనిచేశా. రైతులకు దీర్ఘకాలికంగా ఆదాయం వచ్చేలా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించా. తెలంగాణవ్యాప్తంగా ఆయిల్‌పామ్ సాగు పెరిగింది. రైతులకు అది ఎంతో లాభదాయకమైన పంటగా మారుతోంది. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే నా లక్ష్యం. ఏ పదవిలో ఉన్నా రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలన్నదే నా ఆలోచన. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యంగా జనగామ, స్టేషన్‌ఘఈన్‌పూర్, పాలకుర్తి, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేటలో నాకు ప్రత్యేకంగా పనిచేసే సైన్యం ఉంది. నాకంటూ ఓటు బ్యాంకు ఉంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపులో నా పాత్ర కూడా ఉంటుంది. జంగా అంటే ఒక వ్యక్తి కాదు.. అనేక నియోజకవర్గాల్లో ప్రజలతో నాకు ఉన్న అనుబంధం, కార్యకర్తల బలం కలిసిన రాజకీయ శక్తి.

